హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	190	210
సూర్యాపేట	రూ.95	140	160
నల్లగొండ	రూ.97	141	160

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 , కనిష్ఠం 16.8

నేటి నుంచి 17వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు

వామ్మో హైవే



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విస్తరించిన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) ప్రమాదాలకు నెలవుగా మారింది. నిత్యం ప్రమాదాలతో నెత్తురోడుతోంది. గత రెండేళ్లలో 624 మంది ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 430 మంది ప్రాణాలు కోల్పోగా, 634 మంది క్షతగాత్రులుగా మిగిలారు. వెరసి హైవే ప్రమాదాలకు అడ్డాగా మారింది. అతివేగం, నిర్లక్ష్యం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదాల నివారణలో జాగ్రత్తలే ప్రధాన భూమిక పోషిస్తాయని అధికారులు తెలుపుతున్నారు.

- కోదాడ

హైదరాబాద్-విజయవాడ రహదారిపై నిత్యం రోడ్డు ప్రమాదాలు

రెండేళ్లలో 624 ప్రమాదాలు, 430 మంది మృతి, 634 మంది క్షతగాత్రులు

మితిమీరిన వేగం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు

ఉమ్మడి జిల్లాలోని రాష్ట్ర సరిహద్దు నల్లబండగూడెం నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సమీపంలోని దండుమల్కాపురం వరకు విస్తరించి ఉంది. సుమారు 145 కిలోమీటర్ల ఉన్న ఈ హైవేపై చిట్యాల, చౌటుప్పల్,నార్కట్‌పల్లి, నకిరేకల్, కేతేపల్లి, సూర్యాపేట, మునగాల, కోదాడటౌన్, కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్ల పరిధిలో ఈ హైవే ప్రమాదాలకు అడ్డాగా మారింది. వాహనదారుల మితిమీరినవేగం, చిన్న,చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రవాణా శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. సామర్థ్యానికి మించి సరుకు, ప్రయాణికుల రవాణా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో రెప్పపాటులో ప్రమాదాలకు కారణమంటున్నారు. అందుకు 2022, 2023 డిసెంబరు చివర నాటికి రెండేళ్లలో(24నెలలు, 730 రోజులు, 17,520 గంటల) జరిగిన 624 ప్రమాదాలు ఆయా ప్రమాదాల్లో 430 మంది మృతి చెందడం, 634మంది క్షతగాత్రులుగా మిగలడాన్ని నిదర్శనంగా చెబుతున్నారు. ప్రమాదాలు వాహనదారుల కుటుంబాలలో విషాదాన్ని నింపటంతో పాటు కుటుంబసభ్యులను అనాథలుగా మారటం ఆందోళన పరుస్తోంది. ప్రమాదాలకు ప్రధానకారణం నిర్లక్ష్యం, వాహనం ఉన్న ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అప్రమత్తంగా నడిపితే ప్రమాదాలకు అవకాశం ఉండదని నిపుణులు పేర్కొంటున్నారు. అదేవిధంగా జాతీయ రహదారి నిర్మాణంలోని సాంకేతిక సమస్యలు కూడా ప్రమాదాలకు కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల నివారణకు నేటి నుంచి జరిగే జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగానైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రెండు రోజులకు ఒకరుచొప్పున

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని హైవే-65పై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. సగటున రెండు రోజులకు ఒకరు చొప్పున ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. హైవేపై 2022లో 326 ప్రమాదాలు చోటుచేసుకోగా 225 మంది మృతి, 337 మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 298 ప్రమాదాల్లో 205 మంది మృతి చెందగా, 297 మంది క్షతగాత్రులయ్యారు. మొత్తంగా రెండేళ్లలో 624 ప్రమాదాల్లో 430 మంది మృతి చెందారు. అయితే రహదారి నిర్మాణం సక్రమంగా చేపట్టకపోవడంతో బైపాస్‌లు, జంక్షన్‌లు, క్రాసింగ్‌లు, ఇంటర్ సెక్షన్లలో ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రహదారిపై ప్రమాదం జరగకుండా వాహనదారులు గమ్యం చేరాలంటే అతివేగం, నిర్లక్ష్యం వీడాలని నిపుణులు సూచిస్తున్నారు. అదేవిధంగా హైవేపై అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిపై బ్లాక్‌స్పాట్స్

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూరు, కొర్లపహడ్, జనగాం క్రాసురోడ్డు, దురాజ్‌పల్లి గ్రామం, ముకుందాపురం, ఆకుపాముల బైపాస్, కొమరబండ క్రాస్‌రోడ్డు, మేళ్లచెర్వు క్రాస్‌రోడ్డు, శ్రీరంగపురం, రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద బ్లాక్‌స్పాట్స్(తరుచూ ప్రమాదాలు జరిగే చోట్లు)ను అధికారులు గుర్తించారు. ఆయా చోట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.



మునగాలలో తరుచూ ప్రమాదాలు జరిగే చోటు

జాగ్రత్తలతో ప్రమాదాలకు చెక్

ద్విచక్రవాహనం నడిపేవారు విధిగా హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టును ధరించాలి. మద్యం తాగి వాహనం నడుపకుండా ఉంటే సగం ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అంతేకాక ద్విచక్రవాహనంపై ఇద్దరే ప్రయాణించాలి, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను, పిల్లల ను ఎక్కించరాదు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడకపోవటం. వాహనాలు మలుపు తిప్పేటప్పుడు, వెనుకవారి కి సిగ్నల్ ఇవ్వటం చేయాలి. ఆటోడ్రైవర్ పక్కన ఎవరినీ కూర్చోకుండా చూడటం, రహదారికి ఎడమవైపు మాత్రమే లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలు నడపితే ప్రమాదాలు నివారించవచ్చు. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు తక్కువ వేగంలో వెళ్లాలి. వాహనం కండిషన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పకుండా పాటిస్తే ప్రమాదాలు జరుగవని రవాణశాఖ అధికారుల చెబుతున్నారు.



ఈ లోటు తీర్చనిది...

కుమారుడు, కుమార్తెతో ఆనందంగా గడుపుతున్న మురళీకృష్ణ కుటుంబం సంక్రాంతి పండగ మరునాడు ప్రమాదంలో చిన్నాభిన్నమైంది. అత్తగారిలైన నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లికి వెళ్లి వస్తుండగా టైర్ పంక్చర్ కావడం, అతివేగంగా వెళ్తున్న కారు ఆ కుటుంబాన్ని మృత్యుమార్గం పట్టించింది.. మంచి ఉద్యోగం, ఉన్నతంగా చదువుతున్న పిల్లలతో ఆనందానికి ఏలోటూ లేకుండా సాగుతున్న క్రమంలో ప్రమాదంలో మురళీకృష్ణతో పాటు కుమార్తె, భార్య కవిత, ధనూష మృతి చెందారు. ఇప్పుడు కుమారుడు యువనీతకృష్ణ ఒంటరివాడయ్యాడు.. ఆ బాలుడు భవిష్యత్తును అంధకారం చేసింది.. అండగా ఉండి, ఆప్యాయతలు పంచే అమ్మనాన్నలు లేకపోవడం ఆ బాలుడికి తీరనిలోటు..



నిర్లక్ష్యంగా డ్రైవింగ్‌తోనే ప్రమాదాలు



రోడ్డు ప్రమాదాలకు కారణం నిర్లక్ష్యపు డ్రైవింగ్. ద్విచక్రవాహనదారులు, కారు, ఆటో నడిపేవారు అతివేగంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్ నింబంధనలు పాటించరు. ఫలితంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.ప్రతీ వాహనాదారుడు బాధ్యతగా రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలకు అడ్డుకట్టవేయాలి.

- ఎంవీఐ బాబురావు

ముమ్మరంగా దరఖాస్తుల ఆన్‌లైన్

▸ విస్తృతంగా అధికారుల తనిఖీలు ▸ విధుల్లో ఉన్న టీంలకు మంజూరు కాని నిధులు

నల్లగొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం పథకం కింద సంక్షేమ పథకాల కోసం తీసుకున్న దరఖాస్తుల కంప్యూటరీకరణ ముమ్మరంగా సాగుతోంది. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఈ నెల 17లోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కంప్యూటరీకరణను వేగవంతంగా చేయించేందుకు కలెక్టర్లు దృష్టిసారించారు. ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను తనిఖీ చేసి పొరపాట్లు జరగకుండా నమోదు చేసేలా చూస్తున్నారు. పథకాల వారీగా దరఖాస్తులను వేర్వేరు చేసి కంప్యూటరీకరణ చేస్తున్నారు. కొన్ని దరఖాస్తుల్లో మొబైల్ నెంబర్లు వేయకపోవడంతో గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా ఫోన్‌నెంబర్లను సేకరించి నమోదు చేస్తున్నారు.

ట్రంకు పెట్టెల్లో దరఖాస్తులు భద్రం

ఆన్‌లైన్ డేటా ఎంట్రీ పూర్తయిన తర్వాత దరఖాస్తులను ట్రంకు పెట్టెలు, బీరువాల్లో భద్రపరుస్తున్నారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో అభయహస్తం దరఖాస్తులు రోడ్డుపైన పడటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ ఘటనలో ఇద్దరు ఉద్యోగులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అలాంటి ఘటనలు జిల్లాలో జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అభయహస్తం దరఖాస్తులు తీసుకున్న సమయంలో అధికారులు రిసీవ్ కాపీ ఇచ్చారు. ఎవరైనా దరఖాస్తు ఇవ్వలేదని అనకుండా ఉండే విధంగా రశీదు ఇచ్చినందున ఎవరి దరఖాస్తు పొరపాటున పోయినా లబ్ధిదారుల నుంచి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. దీంతో అధికారులు అప్రమత్తమై దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు వాటిని భద్రపర్చే పనిలో నిమగ్నమయ్యారు. కలెక్టర్లు అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీని క్షుణ్ణంగా పరిశీలిస్తూ తగిన విధంగా సూచనలు, సలహాలు ఇస్తూ ముందుకు సాగుతున్నారు.

సిబ్బందికి మంజూరు కాని నిధులు

ఉమ్మడి జిల్లాల్లోని చాలా మండలాల్లోని కార్యాలయాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సిబ్బందితో ఆన్‌లైన్ పనులు చేపడుతున్నారు. పనులు చేస్తున్న వారికి ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. ప్రైవేట్ సిబ్బందికి ఒక్కో దరఖాస్తు ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తిచేస్తే రూ.15వరకు చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రైవేట్ సిబ్బంది మాత్రం ఏరోజుకారోజే డబ్బులు ఇవ్వాలని కోరుతుండగా చివరి రోజు ఇస్తామని అధికారులు స్పష్టం చేస్తుండడంతో ప్రైవేట్ సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ఈ నెల 17వరకు ఆన్‌లైన్ పనులు పూర్తిచేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు. పండుగ వస్తుండటంతో ఆన్‌లైన్ పనులకు ఏమైనా ఆటంకాలు కలిగే అవకాశం ఉండటంతో వీలైనంత మేరకు ఆన్‌లైన్ త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఆన్‌లైన్ చేస్తుండటం, ఏమైనా తప్పులు జరిగితే ఇబ్బందులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వ కార్యాలయాల్లో, అధికారుల పర్యవేక్షణలో కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం సైతం హైదరాబాద్‌లో అభయహస్తం దరఖాస్తులు రోడ్డుపై పడిన నేపథ్యంలో అప్రమత్తమై ప్రభుత్వ అధికారులకే దరఖాస్తులను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించింది.



సూర్యాపేటలో ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు(ఫైల్)

3.11లక్షల దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి

సూర్యాపేట టౌన్: జిల్లాలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. 58 బృందాల్లోని 872 మందితో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ ప్రక్రియను ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 3,62,203 దరఖాస్తులకుగాను బుధవారం రాత్రి వరకు 3,11,107 దరఖాస్తులను ఆన్‌లైన్ డేట ఎంట్రీ పూర్తయింది.

యాదాద్రి జిల్లాలో దాదాపు 47శాతం పూర్తి

యాదాద్రి, జనవరి10(ఆంధ్రజ్యోతి): అభయ హస్తం సంక్షేమ పథకాలకోసం వచ్చిన దరఖాస్తులపై యాదాద్రిభువనగిరి జిల్లా యంత్రాంగం ఆన్‌లైన్ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాలో బుధవారం నాటికి దాదాపు 47శాతానికిపైగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను మాత్రమే నమోదుచేసి, నమూనా చూసిన తర్వాత సబ్మిట్ చేస్తున్నారు. పూర్తి చేసిన తర్వాత వచ్చే నెంబర్లను దరఖాస్తుల మీద రాస్తున్నారు. జిల్లాలో మొత్తం 2,18,807 కుటుంబాలున్నాయి. జిల్లాలోని ఆరు మునిసిపాలిటీల్లో 14 కేంద్రాలు, 17 మండలాల్లో 37కేంద్రాల ద్వారా 51 బృందాలతో దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో మొత్తం 2,60,525 దరఖాస్తులు అందాయి. రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై అదనంగా మరో 4,397 దరఖాస్తులు అందాయి. జిల్లాలో మొత్తం 2,64,922 దరఖాస్తులు అందాయి. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,83,901 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగా, మరో 1,85,388 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ప్రభుత్వం విధించిన గడువులోగా పూర్తి చేసేందుకు కలెక్టర్ హనుమంతు కే.జెండగేతోపాటు అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఎ.భాస్కర్‌రావు మండలాల స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ల సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు మండలాల్లో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నారు.

నల్లగొండ జిల్లాలో 6,11,853 దరఖాస్తులు

నల్లగొండ జిల్లాలో ఎనిమిది రోజుల పాటు అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 6,11,853 దరఖాస్తులు వచ్చాయి. దీంతో జిల్లా అధికారులు ఈ దరఖాస్తులన్నింటినీ సకాలంలో ఆన్‌లైన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటి భద్రత కోసం చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట క్రైం, జనవరి 10 : సంక్రాంతికి ఊళ్లకు వెళ్లేవారు భద్రత కోసం జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా దొంగతనాలు జరగకుండా పటిష్టచర్యలు చేపట్టామన్నారు. ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు తమ ఇళ్లకు కాలనీలకు, పరిసరాల ప్రాంతాలకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు.



ఎస్పీ రాహుల్‌హెగ్డేకు పూలమొక్క అందజేస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా

ఎస్పీని కలిసిన ట్రైనీ ఐపీఎస్ అధికారి

ఎస్పీ రాహుల్‌హెగ్డేను సర్దార్ వల్లాబాయి పటేల్ జాతీయ శిక్షణ కేంద్రంలో శిక్షణలో ఉన్న ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా జిల్లా పోలీస్‌కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ మండల, పట్టణ పోలీస్‌స్టేషన్లు, క్షేత్రస్థాయిలో పోలీసుల విధులు పోలీస్ అడ్మినిస్ట్రేషన్, కేసుల దర్యాప్తు, క్రైం రికార్డులు, ఇంటెలిజెన్స్ విధులు, ఎస్‌హెచ్‌వో, ఎస్‌డీపీవో విధులు వంటి వాటిపై సూచనలు, సలహాలు చేశారు.

రికార్డులను సక్రమంగా నమోదుచేయాలి

నేరేడుచర్ల, జనవరి 10 : ఎరువులు డీలర్లు విక్రయాలు, నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సంధ్యారాణి సూచించారు. బుధవారం నేరేడుచర్లలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. సక్రమంగా రికార్డులు నమోదు చేయకుంటే ఎరువుల సరఫరా జరగదని హెచ్చరించారు. రికార్డుల ప్రకారమే ప్రభుత్వం ఎరువులు సరఫరా చేస్తుందన్నారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో 1.39 లక్షల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా, సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల కాకపోవడంతో వానాకాలంలో 1.18 లక్షల ఎకరాలు వరి సాగు చేశారన్నారు. యాసంగిలో సుమారు 80వేల ఎకరాల వరి పంట సాగు చేశారన్నారు. డివిజన్‌లో ఎరువుల కొరత లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జావిద్, డీలర్ పోలా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

యాసంగి సాగుకు విత్తనాలు సిద్ధం

సూర్యాపేట సిటీ, జనవరి 10 : యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటల సాగుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సిద్ధంగా ఉంచిందని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ(టీఎస్ సీడ్స్) ఉమ్మడి నల్గొండ రీజినల్ మేనేజర్ జీ కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుతడి పంటలకు సంబంధించి పెసర, మినుములు, వేరుశనగ, శనగ సాగుకు టీఎస్ సీడ్స్ ఆధ్వర్యంలో శుద్ధి చేసిన విత్తనాలను ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆయా టీఎస్ సీడ్స్ గోదాంలలో రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. పెసలు కిలో రూ.108ల చొప్పున నాలుగు కిలోల బస్తాకు రూ.432లు, మినుములు కిలో రూ.106ల చొప్పున నాలుగు కిలోల బస్తాకు రూ.424లు, వేరుశనగ కిలో రూ.95.50లు చొప్పున 30 కిలోల బస్తాకు రూ.2,865లు, శనగలు కిలో రూ.75ల చొప్పున 25 కిలోల బస్తాకు రూ.1,875లుగా ధరలు నిర్ణయించామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, ఇతర వివరాల కోసం ఫోన్‌నెంబరు 9849908757లో సంప్రదించాలన్నారు.

నేడు జడ్పీ స్థాయీ కమిటీల సమావేశాలు

సూర్యాపేట సిటీ, జనవరి 10: జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో గురువారం స్థాయీ కమిటీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈవో సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు 1వ(ఆర్థికం), 7వ(పనులు), 2వ(గ్రామీణాభివృద్ధి), 4వ(విద్య, వైద్యం) స్థాయీ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశాలకు జడ్పీ చైర్‌పర్సన్ దీపిక అధ్యక్షత వహిస్తారని, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశాలకు హాజరుకావాలన్నారు.

అంతర్ పంటల సాగుతో అధిక లాభాలు: కలెక్టర్

చివ్వెంల, జనవరి 10 : ఆయిల్‌పాం క్షేత్రంలో అంతర్‌పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చునని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుంపుల, తిరుమలగిరి గ్రామాల్లో ఆయిల్‌పాం తోటలను పరిశీలించి, మాట్లాడారు. అంతర పంటలుగా మిర్చి వేసిన రైతును అభినందించారు. ఆయిల్ పాం సాగు చేసిన నాల్గో సంవత్సరంలో దిగుబడి వస్తుందని సుమారు 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. సాగుచేసిన నాలుగు ఏళ్ల వరకు మిర్చి, కూరగాయలు, వేరుశనగ, కంది, అరటి, బొప్పాయి వంటి పంటలను సాగుచేసి అధిక లాభాలు పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి శ్రీధర్, యాదగిరి, జగన్, హరీష్, రాఘవరెడ్డి, దుబ్బాక ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు

భానుపురి: ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులని, ఉపాధ్యాయ వృత్తికి ఏ వృత్తి సాటిరాదని కలెక్టర్ వెంకటరావు అన్నారు. బుధవారం డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. డీఈవో అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో డీటీఎఫ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం సీపీఎస్ రద్దుపై వెంటనే నిర్ణయం ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రావు, రాష్ట్ర కౌన్సిలర్లు దశరథరామారావు, పీ వెంకటేశ్వర్లు, సీహెచ్ కవిత, జీ వెంకటేశ్వర్లు, టీ ప్రభాకర్, క్రాంతికుమార్, సింహాద్రి, యాదగిరి, ఎస్.పరమేష్, అబ్రహం, సాహెబ్, వీ సైదులు, ఎం వెంకన్న, కే వెంకటరెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.



అంతర్‌పంటగా మిరప సాగును పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

బీజేపీ తీరుతో దేశం దివాళా

సూర్యాపేట సిటీ, జనవరి 10 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుతో దేశం ఆర్థికంగా దివాళా తీసిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటరెడ్డిభవన్‌లో నిర్వహించిన సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక, కర్షక సంఘాల జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సూర్యాపేటలో ఈ నెల 19న నిర్వహించే జిల్లా సదస్సును జయప్రదం చేయాలన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ గత పదేళ్లలో అనుసరించిన విధానాలతో దేశం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి, రైతులను బలవంతంగా భూముల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేసిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎం రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, దండ వెంకటరెడ్డి, ములకలపల్లి రాములు, కొప్పుల రజిత, చెరుకు ఏకలక్ష్మీ, పులుసు సత్యం, కందాల శంకర్ రెడ్డి, వజ్జా శ్రీనివాస్, కోటగిరి వెంకట నారాయణ, బుర్ర శ్రీనివాస్, వట్టెపు సైదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

నాబార్డు తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల ● 5లో

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళల ఆత్మహత్య


శివలీల (ఫైల్ ఫొటో)


దుర్గ (మృతదేహం)

డిండి, కోదాడ, జనవరి 10: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో బుధవారం ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు. డిండి ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రానికి చెందిన తోకల శివలీల(28) మేదర పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. భర్త దేవేందర్ అనారోగ్యంతో ఆరు నెలల క్రితం మృతి చెందాడు. దీంతె ఆమె ఇద్దరు కుమారులు, అత్తమామలతో కలిసి ఉంటోంది. బుధవారం తెల్లవారుజా మున మామ జంగయ్య తలు పులు కొట్టినా ఆమె తెరవలేదు. తలుపులు ధ్వంసం చేసి చూడగా, చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. వెంటనే కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. శివలీల బంధువులు వచ్చి జంగయ్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న డిండి ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని అందరికీ సర్దిచెప్పారు. అనంతరం శివలీల మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివలీలను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి అన్నయ్య శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

●సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన రమావత్ దుర్గ(30)కోదాడలోని పాత పోస్టాఫీస్ సమీపంలో రెడీమేడ్ వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తోంది. రోజు మాదిరిగానే బుధవారం దుకాణానికి వెళ్లిన ఆమెకు భర్త మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఇంటికి వెళ్లిన ఆమె ఉరేసుకుంది. గమనించిన స్థానికులు బంధువులకు సమాచారం ఇచ్చారు. భర్త రాజు వేధింపులతోనే ఉరేసుకుందని ఆమె తండ్రి ధారవత్ భావసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

పెద్దవూర, జనవరి 10: తన పొలం మీదుగా విద్యుత్‌లైన్ వేసినందుకు మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని బాసోనిబావితండాకు చెందిన రైతు రమావత్ బల్లు, తన పొలం నుంచి పక్కనే ఉన్న మరో రైతు పొలంలోకి 11కేవీ విద్యుత్ లైన్ వేయవద్దని అధికారులకు విన్నవించాడు. అదే లైన్ కింద తన బోరు ఉండడంతోపాటు మరో రెండు బోర్ పాయింట్లను ఎంపిక చేసుకున్నాడు. దీంతో తన పొలంలోని మరో గట్టు నుంచి విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయాలని సూచించినా, విద్యుత్ అధికారులు పాటించలేదు. దీంతో మనస్తాపం చెందిన రైతు మంగళవారం సాయంత్రం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు నల్లగొండ జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రైతు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ విషయపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

● నల్లగొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు బల్లును మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పరామర్శించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితుడిని న్యాయం జరిగేలా చూస్తానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట జటావత్ రవినాయక్, రమావత్ రవినాయక్, శివాజి, నరేష్, సైదాచారి ఉన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

సూర్యాపేట రూరల్, జనవరి 10: కుక్కల దాడిలో జింక మృతి చెందింది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని యర్కారం గుట్టల నుంచి తప్పిపోయి గ్రామంలోకి వచ్చిన జింకను కుక్కలు వెంబడించి తీవ్రంగా గాయపర్చాయి. జింకను గమనించిన గ్రామస్థులు కుక్కలను తరిమి అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని జింకను పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. జింక కళేబరానికి సూర్యాపేట పశువుల వైద్యశాలలో గురువారం పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎఫ్ఆర్వో హఫీజ్‌ఖాన్ తెలిపారు.

పిచ్చికుక్క కరవడంతో 11మందికి గాయాలు

మఠంపల్లి, జనవరి 10: పిచ్చి కుక్క 10మందిని కరిచింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపాలెం గ్రామ సమీపంలోని పంట పొలాలలో పనిచేస్తున్న కూలీలపై ఓ పిచ్చికుక్క ఆకస్మికంగా దాడి చేసి కరిచింది. ఈ ఘటనలో వెంకటాయపాలెంకు చెందిన వృద్ధురాలు భూసిపల్లి చెన్నమ్మకు కన్ను, తలపై తీవ్ర గాయాలయ్యాయి. మఠంపల్లి, హనుమంతులగూడెం, మంచ్యాతండా, రఘునాథపాలెం, వెంకటాయపాలెం గ్రామాలకు చెందిన ఎం.ఉమ, నందిపాటి లక్ష్మి, రెడపంగు స్రవంతి, రూపావత్ చెంమ్మ, షేక్ లాల్‌జాన్, లాల్ మహ్మద్‌కు గాయాలయ్యాయి. వీరందరినీ ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనతో పంట పొలాలకు వెళ్లాలంటే కూలీలు భయపడుతున్నారు.

హిట్ అండ్ రన్ జీవోను రద్దు చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మిర్యాలగూడలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

యాదాద్రి జనవరి 10 (ఆంధ్రజ్యోతి)/ కోదాడ/ మిర్యాలగూడ: ఇటీవల కేంద్రం తెచ్చిన హిట్‌అండ్‌రన్ జీవోను వెంటనే రద్దుచేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని ఈదులగూడ చౌరస్తా వద్ద రైస్‌మిల్లర్స్ డీసీఎం డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ చట్టం పేరుతో డ్రైవర్లకు రూ.7 లక్షల జరిమానా, పదేళ్ల జైలు శిక్ష విధించడం అమానుషమన్నారు. కావాలని ఎవరూ యాక్సిడెంట్‌లు చేయరని అన్నారు. పేద, మధ్యతరగతికి చెందిన పేదలే అధికంగా డ్రైవింగ్ ఫీల్డ్‌లో ఉన్నారని వృత్తి ముగించుకుని ఇంటికి వచ్చి తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుకుంటారన్నారు. డ్రైవర్లపై అకారణంగా చేయి చేసుకునేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డబ్బికార్ మల్లేష్, తిరుపతి రాంమూర్తి యూనియన్ నాయకులు జీవన్, నాగటి జోసఫ్, అనంతుల రాజేష్, పుట్టల బాబు, జాగటి సైదులు బాబా, కొరటికల్ రవి, అభినవ్ పాల్గొన్నారు. డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వం విధించిన హిట్ అండ్ రన్‌ను రద్దు చేయాలని శ్రీలక్ష్మీనరసింహస్వామి రథసారథి అసోయేషన్ అధ్యక్షుడు అంకర్ల భిక్షపతి డిమాండ్ చేశారు. డ్రైవర్లు యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జగన్మోహన్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు సుబ్బారి రాజు, గంటేపాక పాండు, గాజుల నరేష్, వెంకటేష్, మల్లారెడ్డి పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా కోదా డలో 65నెంబర్ జాతీయ రహదారిపై లారీ డ్రైవర్లు నిరసన తెలిపారు. కొత్తచట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● ప్రపంచానికి ఆహారాన్ని అందించే సత్తా దేశానికి ఉంది
● నాబార్డు తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల

యాదాద్రి జనవరి 10 (ఆంధ్రజ్యోతి)/ బొమ్మలరామారం: రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని నాబార్డు తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం సోలిపేటలో ధీశాలి మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో ఏర్పాటుచేసిన 'వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు' అనే అంశంపై శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో 1.4 బిలియన్ జనాభాతోపాటు ప్రపంచానికి ఆహారాన్ని అందించగల సత్తా భారతదేశానికి ఉందని తెలిపారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ పొలాల్లో వినియోగించుకుని, ఉత్పాదతకను పెంచుకుని... రైతు ఉత్పత్తిదారుల సంఘాలను అభివృద్ధి చేయాలని సూచించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధితోపాటు అనేక కార్యక్రమాల్లో రైతుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు నాబార్డును స్థాపించినట్లు వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా వివిధ సాంకేతిక పద్ధతులను రైతుల చేరువలోకి తీసుకునేందుకు నాబార్డు ప్రోత్సహిస్తోందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పడకముందు, ఏర్పడిన తర్వాత రైతుల్లో గణనీయమైన మార్పులు గమనిస్తున్నామని, ఈ మార్పు కొనసాగించాలం టే రైతులందరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాబార్డు అధికారి వినయ్‌కుమార్ ధీశాలి, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ మధుబాబు, శ్వేతసింగ్, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

భువనగిరి అవిశ్వాసంపై హైకోర్టుకు !

● స్టే కోసం ప్రయత్నాలంటూ ప్రచారం ● కెవిట్ పిటిషన్ వేసిన అసమ్మతి కౌన్సిలర్లు

భువనగిరి టౌన్, జనవరి 10: భువనగిరి మునిసిపల్ అవిశ్వాస రాజకీయాలు హైకోర్టు గుమ్మాన్ని తాకుతున్నాయి. 35 మంది సభ్యులు గల కౌన్సిల్‌లో చైర్మన్ ఎనబోయిన అంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్యపై 31 మంది ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుల మేరకు కలెక్టర్ ఈ నెల 23న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో మునిసిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. మూడు నెలల క్రితం కూడా 19 మంది సభ్యులతో అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వగా అప్పట్లో చైర్మన్, వైస్‌చైర్మన్ హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. అనంతరం ఆ స్టేను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో తిరిగి రెండోసారి 31 మంది అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తూ కౌన్సిలర్లకు అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే గతంలో మాదిరిగానే చైర్మన్, వైస్‌చైర్మన్ మరోమారు స్టే కోసం హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు జరిగిన ప్రచారంతో అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన కౌన్సిలర్లు హైకోర్టులో కేవిట్ పిటిషన్ వేసినట్లు ప్రచారం అవుతోంది. అవిశ్వాస తీర్మానంపై ఎలాంటి స్టే ఇవ్వరాదని వేసిన కెవిట్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు అవిశ్వాస తీర్మానంపై స్టే ఇవ్వడానికి అవకాశం లేదంటూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత కౌన్సిలర్లు ప్రచారం చేస్తున్నారు. హైకోర్టు ఉత్తర్వులను తమ న్యాయవాది చైర్మన్ వర్గీయులకు అందజేసినట్లు చెబుతున్నారు. దీంతో 23న జరిగే అవిశ్వాస తీర్మానం ప్రత్యేక సమావేశం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యవిధి కైంకర్యాలు



ఆలయ తిరువీధుల్లో ఆండాళ్ అమ్మవారి అలంకారసేవను ఊరేగిస్తున్న అర్చకస్వాములు

యాదగిరిగుట్ట, జనవరి 10: ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు, ఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. ఉత్తర దిశలోని మొదటి ప్రాకార మండపంలో ఆండాళ్ అమ్మవారిని ఆరాధిస్తూ ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించారు. అష్టభుజి ప్రాకార సుదర్శన హోమం, నిత్యతిరుకల్యాణం నిర్వహించిన అర్చకులు మధ్యాహ్నం వేళ ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా పెళ్లికూతురుగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అలంకారసేవను వేదమంత్రపఠనాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రధానాలయ తిరువీధుల్లో ఊరేగించారు. పెళ్లికుమార్తె అలంకరణలోని ఆండాళ్ అమ్మవారిని కొలుస్తూ మహిళా భక్తులు మంగళ నీరాజనాలను పాడారు. ఐదు రోజుల పాటు నిర్వహించే నీరాటోత్సవ వేడుకల్లో తొలి రోజు శ్రీరంగనాథుడిని గోదాదేవి చేరుకునే ఘట్టాలు నేత్రపర్వంగా నిర్వహించారు. కాగా యాదగిరికొండపైన అనుబంధ శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరుడికి నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ప్రధానాలయంలోని రామలింగేశ్వరుడికి, మహామండపంలోని స్ఫటికమూర్తులను పంచామృతాలతో అభిషేకించి, బిల్వపత్రాలతో అర్చించారు. యాగశాలలో నిత్యరుద్రహవనం, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,94,816 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆడ పిల్లల జననం శుభ సూచకం: అన్నపూర్ణ



బాలింతకు బహుమతిని అందజేస్తున్న సంక్షేమ అధికారి అన్నపూర్ణ తదితరులు

భువనగిరి టౌన్, జనవరి 10: ఆడ పిల్లల జననం శుభ సూచకమని జిల్లా సంక్షేమ అధికారి అన్నాపూర్ణ అన్నారు. ఇటీవలే ఆడ పిల్లలకు జన్మనిచ్చిన మాతృమూర్తులను బుధవారం భువనగిరి జిల్లా ఆసుపత్రిలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కవిత, సీడీపీవో ఆర్ స్వరాజ్యం, సూపర్‌వైజర్లు కె.పద్మ, నర్మద, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ హర్ష పాల్గొన్నారు.





'గొట్టిముక్కల' పూర్తిచేసి తాగునీరు అందిస్తాం

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జనవరి 10: గొట్టిముక్కల రిజర్వాయర్‌ను పూర్తి చేసి ప్రాజెక్టు పరిధిలోని 50వేల ఎకరాల వరకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. దేవరకొండ మండలం కమలాపూర్‌లో వీరభద్రస్వామి దేవాలయంలో బుధవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిండి ఎత్తిపోతల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీల పథకాలను మహిళలతో పాటు పేద బడుగు, బలహీన వర్గాల అందరికి లబ్ధి చేకూరుతుంద ని తెలిపారు. సాగునీరు, విద్య, వైద్యం, రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తానని అన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యులు జాలె నర్సింహారెడ్డి, సిరాజ్‌ఖాన్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, జాన్‌యాదవ్, వడ్త్య దేవేందర్‌నాయక్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, బిక్కునాయక్, నర్యానాయక్‌తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ రాములునాయక్‌తో పాటు డాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి రోగుల వివరాలు, సిబ్బంది, సౌకర్యాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పిస్తామన్నారు.





'గిరి వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

గుర్రంపోడు, జనవరి 10: గిరిజనులు గిరి వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తేనెపల్లి తండాలో బుధవారం గిరివికాసం పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజనుల వ్యవసాయ భూముల్లో బోర్లు వేయించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గాలి సరితరవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్, మాజీ అధ్యక్షుడు జాల చినసత్తయ్య యాదవ్, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, జవహర్‌లాల్, యాదగిరి పాల్గొన్నారు.


కళాకారులను ఆదుకోవాలి

నల్లగొండరూరల్, జనవరి 10: జానపద వృత్తి కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర నాయకుడు కె.నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన జానపద వృత్తి కళాకారుల సంఘ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే జానపద వృత్తి కళల్ని కాపాడుతున్న కళాకారులు లక్షల్లో ఉన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత పల్లె సంస్కృతిని కాపాడుతూ కోలాటం బ్యాండ్, చెక్కభజన, అల్లాకే నామ్ బుర్రకథ, ఒగ్గుడోలు, దమనగొయ్య, పిట్టలదొర, యక్షగానం, కాటికాపరులు చిందు భాగవతం లాంటి వివిధ రకాల వృత్తి కళాకారులు ఉన్నారని అన్నారు. ఇప్పటికీ తన ఆటపాటలతో ప్రజల్ని ఆహ్లాదపరుస్తూ ఉన్న వాళ్ల జీవితాల్లో మాత్రం వెలుగులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జానపద వృత్తి కళాకారులకు రూ. 6000 పింఛన్ ఇవ్వాలని, వారికి ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని కోరారు. వివిధ దేవస్థానాల్లో యాదగిరిగుట్ట, చెర్వుగట్టు, రేణుక ఎల్లమ్మ, జాన్‌పహాడ్ సైదులు ఇలాంటి పుణ్యక్షేత్రాల్లో అవకాశాలు కల్పించాలన్నారు. ఆ సంఘం జిల్లా నాయకులు నాంపల్లి చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ సంఘం నాయకులు కుమ్మరి శంకర్, మాద సైదులు, పల్లె ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడటౌన్, జనవరి 10: ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అం డగా నిలుస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యం లో బుధవారం డిపోలో ఏర్పాటు చేసిన వనభోజనాలకు ఆయన హాజరై మాట్లాడారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఆర్టీసీ ఉద్యోగులు అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైతే అందుకు తన సొంత నిధులను సమకూరుస్తానన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత సంస్థ ఉద్యోగుల పైనే ఉందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను అభినందించారు. వనభోజనాల సందర్భంగా ఉద్యోగులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏఆర్‌ఎం శివశంకర్, డీఎం బొల్లెద్దు పాల్, అధికారులు యాదగిరి, మల్లికార్జున్‌రెడ్డి, జానకిరాంరెడ్డి పాల్గొన్నారు.



12న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 10: ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 12వ తేదీన 11 గంటలకు జూనియర్ బాలికల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఎంపికైన వారిని ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు, ఆధార్ కార్డు జీరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.

తైక్వాండో, బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

రాష్ట్ర యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా స్థాయి తైక్వాండో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో మక్బూల్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 17 బాలబాలికలకు తైక్వాండో, అండర్-25 బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నాగార్జునసాగర్, జనవరి 10: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 20 24-25 విద్యాసంవత్సరంలో ఐదోతరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాగర్ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రజనీకాంత్, గంధవారిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు.



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి అనన్య



ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

వర్ధాపురం ఉప సర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాసం

మఠంపల్లి, జనవరి 10: మండలంలోని వర్ధాపురం గ్రామ ఉప సర్పంచ్ బత్తుల శంకరయ్యపై అవిశ్వాసం నెగ్గింది. చెక్‌పవర్ ఉందని అభివృద్ధి సంక్షేమ పథకాలకు అడ్డుపడుతూ పాలక వర్గానికి సహకరించడంలేదని ఉపసర్పంచ్‌పై వర్ధాపురం పంచాయతీ పాలకవర్గం ప్రకటించిన అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని పంచాయతీ కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి నిర్వహించారు. గ్రామంలో మొత్తం తొమ్మిది మంది వార్డు సభ్యులు ఉండగా, అవిశ్వాసానికి సర్పంచ్ బచ్చలకూరి అఖిల బాబుతో పాటు ఐదుగురు వార్డు సభ్యులు మీసాల చిననర్సయ్య, అమర వరపు జయంతి, ఎండీ గౌసబేగం, గుండు నాగమణి, నంది పాటి నాగరాజు, దొండ పాటి కోటయ్య చేతులు ఎత్తి మద్దతు పలికారు. దీంతో ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం నెగ్గింది. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

హుజూర్‌నగర్, జనవరి 10: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సూర్యాపేట జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్ గౌడ్, ప్రధానకార్యదర్శి నామా నర్సింహారావు తెలిపారు. బుధవారం పట్ట ణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కబడ్డీ క్రీడాకారుల జాబితాను ప్రకటించారు. సిద్దిపేట జిల్లాలో ఈ నెల 11నుంచి 14 వరకు 49వ అంతర్ జూనియర్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పోటీలకు ఎంపిక చేసిన బాలబాలికల జిల్లా కబడ్డీ జట్లను వెల్లడించారు.

జిల్లా బాలుర కబడ్డీ జట్టు: ఎం.రాముడు(మల్లారెడ్డిగూడెం), బి.నర్సింహ(సర్వారం), ఎస్‌కే జావీద్(మల్లారెడ్డిగూడెం), కె.అజిత్ (హుజూర్‌నగర్), ఎం.సాయికుమార్(నడిగూడెం), ఎం.ముక్తారెడ్డి(గణపవరం), ఆర్.రమేష్(నూతన్‌కల్), ఎం.గురుమూర్తి(మఠంపల్లి), బి.సైదులు(కొత్తగూడెంతండా), పి.అభినవ్(కోదాడ), వై.సాయిగౌతమ్(బూరుగడ్డ), ఎస్‌డీ ఇసాక్(రంగయ్యగూడెం), ఎస్.రాకేష్(తెల్లబల్లి), సీహెచ్ శ్రీకాంత్ (హుజూర్‌నగర్) ఎంపికయ్యారు.

జిల్లా బాలికల కబడ్డీ జట్టు: టి.శ్రుతి (నేరేడుచర్ల), జి.శ్రీజ(మేళ్లచెర్వు), ఎస్.గోపీచంద్రిక(మేళ్లచెర్వు), ఎం.సాయివైష్ణవి(సింగారం), బి.పూజాలహరి(వేపలమాధవరం), ఎం.అంజలి(లక్కవరం), కృష్ణవేణి(మేళ్లచెర్వు), బి.శ్రీవిద్య(ముకుందాపురం), ఎ.దివ్య(మఠంపల్లి), కె.సోని(పెంచికల్‌దిన్నె), ఎస్.నమిత(కోదాడ), కె.అనూష (హుజూర్‌నగర్), బి.సాయిచైతన్య(మఠంపల్లి), కె.భవ్యశ్రీ(అమరవరం) ఎంపికయ్యారు. సమావేశంలో దేవరం రవీందర్‌రెడ్డి, కోచ్ సునీల్, మేనేజర్ మస్తాన్, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆత్మకూర్(ఎస్), జనవరి 10: గ్రామాల్లో, తండాల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ మర్ల స్వర్ణలత కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు.ఆత్మకూర్(ఎస్)మండల కేంద్రంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయినా నీటిని సరఫరా చేయడంలేదని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు లేబర్ కార్డులను అందజేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్సూర్‌నాయక్, ఎంపీవో సంజీవ, ఏవో దివ్య, ఏఈలు బాబురావు, రవికుమార్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభం

కోదాడ రూరల్, జనవరి 10: మండలంలోని తమ్మరబండపాలెంలో ఉన్న శ్రీదేవల్ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం నుంచి వార్షిక ధనుర్మాస ప్రయుక్త అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఛైర్మన్ ముడుంబై వేణుగోపాలాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అధ్యయనోత్సవాలు 14వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

దేవాలయానికి దాతల వితరణ

హుజూర్‌నగర్, జనవరి 10: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి రాజమండ్రికి చెందిన లాట్వాల వెంకటఫణి మారుతి రాకేష్‌శర్మ, ధర్మపత్ని లక్ష్మీలీలాభార్గవి దంపతులు రూ.50వేల విలువచేసే మైక్ సెట్ అందజేశారు. అదేవిధంగా నేరేడుచర్లకు చెందిన పలువురురూ.12వేల విలువ చేసే నాలుగు మైక్ బాక్స్‌లను ఆలయ ఈవో లక్ష్మణ్‌రావుకు అందజేశారు.

రామాలయంలో కోటి దీపోత్సవం

హుజూర్‌నగర్, జనవరి 10: పట్టణంలోని రామాలయంలో బుధవారం రాత్రి కోటి దీపోత్సవం అత్యంతవైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సహకారం మరువలేనిది



కోదాడలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని సన్మానిస్తున్న రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు

కోదాడ టౌన్, జనవరి 10: కోదాడ అసెంబ్లీ నియోజకవర్గంలో తన విజయానికి రిటైర్డు ఉద్యోగులు అందించిన సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, సీనియర్ సిటిజన్స్ కోసం కోదాడలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా నకారా విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. పెన్షనర్లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో కోదాడ యూనిట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మల్లెంపల్లి వెంకటేశ్వరరావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవీటి రామారావు, పారా సీతయ్య, కౌన్సిలర్ కొల్లా ప్రసన్నలక్ష్మీకోటిరెడ్డి, సెక్రటరీ లక్ష్మీనరసయ్య, సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, విద్యాసాగర్, వరప్రసాదరావు, హమీద్, ఖాన్, గడ్డం నరసయ్య, రఘువరప్రసాద్, భ్రమరాంబ, శోభారాణి పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బులు చెల్లించాలని మహిళపై దాడి

సూర్యాపేటక్రైం, జనవరి 10: ఉద్యోగం కోసం చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వడానికి నిరాకరించడంతో సంబంధిత వ్యక్తి భార్యపై బాధితులు దాడి చేశారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. సూర్యాపేటలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి డబ్బులు వసూల్ చేసిన సంబంధిత వ్యక్తి భార్యపై బాధితులు తమ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తు దాడికి పాల్పడిన సంఘటన బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని చంద్రన్నకుంట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి భార్య సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆ వ్యక్తికి సూర్యాపేట మెడికల్ కళాశాలలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే యువకుడు పరిచయమయ్యాడు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రిలో పలురకాల ఉద్యోగాలు ఉన్నాయని, అవుట్‌సోర్సింగ్ యజమాని తనకు పరిచయమని, ఆయన ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆ యువకుడు చంద్రన్న కుంటకు చెందిన వ్యక్తికి తెలిపాడు. దీంతో ఉద్యోగాలు ఇప్పిస్తానని సూర్యాపేట, పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగుల నుంచి రూ. 70లక్షలకు పైగా వసూలు చేశారు. నెలలు గడిచినా ఉద్యోగాలు రానందున సంబంధిత బాధితులు పట్టణ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. డబ్బులు తిరిగి ఇచ్చేందుకు నిర్ణయించిన గడువు ముగిసినా అతడు తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతుఓ ఆగ్రహించిన బాధితులు చంద్రన్న కుంటలోని అతడి ఇంటి వెళ్లి డబ్బులు చెల్లించాలని, ఆస్తులైన తమ పేరిట బదలాయించాలని కోరారు. దీనికి ఆమె నిరాకరించింది. దీంతో బాధితులు ఆమెను బలవంతంగా సమీపంలోని ముత్యాలమ్మ దేవాలయానికి తీసుకువచ్చి గేట్లు మూసివేసి దాడి చేశారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత మహిళలను బాధితుల చెర నుంచి విడిపించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

నిందితులను పట్టుకుంటాం

మద్దిరాల, జనవరి 10: మహిళ మృతి కారణమైన నిందితులను పట్టుకుంటామని సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం అన్నారు. మద్దిరాల మండల కేంద్రంలో కుంచం కళమ్మ హత్య కేసులో విచారణను డీఎస్పీ చేపట్టారు. బుధవారం కళమ్మ ఇంటి పరిసర ప్రాంతాల్లో స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.. డీఎస్పీ వెంట సీఐ బ్రహ్మమురారి, ఎస్‌ఐ సైదులు, ఏఎస్‌ఐ నాగయ్య, సిబ్బంది సతీష్, శ్రీనివాస్, నారాయణరెడ్డి ఉన్నారు.

రైస్ మిల్లు వ్యర్థాలతో ఇబ్బంది

మఠంపల్లి, జనవరి 10: మండల కేంద్రంలో ఉన్న కండె వెంకన్న రైస్ మిల్లుతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ మంగారాథోడ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైస్ మిల్లు నుంచి మసి, దుమ్ము, ధూళి వెలువడుతోందన్నారు. దీంతో ఆహార పదార్థాలు, తాగు నీరు కలుషితమై శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, నాడీ కణ జాల వ్యాధులు, కంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినవారిలో అబ్బగాని భాస్కర్, ప్రపంచ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్, స్థానికులు ఉన్నారు.

పాఠశాల వార్షిక సాంస్కృతిక కార్యక్రమాలు

అర్వపల్లి, జనవరి 10: అర్వపల్లి విజ్ఞాన పబ్లిక్ పాఠశాల్లో వార్షిక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులు కళాప్రదర్శనలు, డ్యాన్స్‌లు, పాటలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పులిజాల వేణుగోపాలరావు, హెచ్‌ఎం వీరాచారి పాల్గొన్నారు.

వృత్తిదారులకు ఫించన్ అందజేయాలి

సూర్యాపేటటౌన్, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం చెప్పు, డప్పు వృత్తిదారులకు రూ.5వేల ఫించన్ అందజేయాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు పరశురాంమాదిగ కోరారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో ఫిబ్రవరి 29న నిర్వహించే పోరుగర్జన సభ కరపత్రాలు బుధవారం జిల్లా కేంద్రంలోని సైనిక్‌పురి కాలనీలోని ఆసంఘ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ఏదావిధిగా కొనసాగించాలని, ఎంపికచేసిన లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కుర్రినాగయ్య, వెంకన్న, ఉపేందర్, సంపత్, మహేష్, వాసు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆత్మకూర్(ఎస్): మండలంలోని కందగట్ల గ్రామానికి చెందిన గోగుల మధుసూధన్‌రెడ్డి తన కుమారుడు జ్ఞాపకార్థం కార్తీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భజనతండా పాఠశాలలో విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కడపర్తి శ్రీనివాస్‌నాయుడుపాల్గొన్నారు.

నేరేడుచర్ల, గరిడేపల్లి: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లేవారు విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచవచ్చని నేరేడుచర్ల ఎస్‌ఐ పరమేష్, గరిడేపల్లి ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి సూచించారు. ఆయా పట్టణాల్లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాలు, నగదును లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. టూర్లకు వెళ్లినట్లు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొదన్నారు.

గరిడేపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ బండ కవితతో కలిసి ఎస్టీయూ క్యాలెండర్‌ను ఎంపీపీ పెండెం సుజాత శ్రీనివాస గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో చత్రునాయక్, ఎస్టీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్తూరి బిక్షం, గొర్రె నాగరాజు, ఎస్టీయు నాయకులు పాలూరి అంజయ్య రాంబాబు పాల్గొన్నారు.

●గరిడేపల్లి మండలంలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులకు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రధానోపాధ్యాయులను ఎంఈవో చత్రు నాయక్‌సన్మానించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ నాగేష్, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జడ్పీటీసీ జగన్‌నాయక్ అన్నారు. మండలంలోని భీల్యానాయక్‌తండా, బాడవతండాలో ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ గోవిందునాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రోగులను మండల వైద్యాధికారి సుధాకర్‌నాయక్ పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలునాయక్, లక్ష్మణ్‌నాయక్, భారతి, భాస్కర్‌నాయక్, రమేష్ ఏఎన్‌ఎం రజిని పాల్గొన్నారు.

●సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మఠంపల్లి మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12 నుండి 14వరకు మండల స్థాయి అండర్-20 కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు స్వామి, మాంగు, సుమన్, శివకృష్ణలు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెం. 91822,85343ను సంప్రదించాలన్నారు.

మఠంపల్లి, అనంతగిరి: ఎమ్మార్పీఎస్ మఠంపల్లి మండల అధ్యక్షుడిగా మండలంలోని పెదవీడు గ్రామానికి చెందిన రెడపంగు నాగరాజును, అనంతగిరి మండల అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనును నియమించారు. ఈ మేరకు నాగరాజు, శ్రీనుకు నియామకపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర నాయ కుడు చింతబాబుమాదిగ అందజేశారు. నాగరాజును సంఘం నాయకులు చిలక లోకేష్, శ్రీను, కాశయ్య, ముత్తయ్య, నవీన్, రాజేష్, కృష్ణ, భిక్షం, కందికట్ల అశోక్ అభినందించారు. కార్యక్రమంలో బండారు గురవయ్య, పున్నయ్య, ఇరుగు మహేష్ సురవల్లి కిరణ్, గణేష్, కోంద్రు అజిత్, మందా సురేష్, చిన్నం బాబు పాల్గొన్నారు.

మునగాల రూరల్: కోదాడ ఎమ్మెల్యేగా పద్మావతిరెడ్డి విజయం సాధించినందుకు మెక్కు చెల్లించేందుకు కాంగ్రెస్ నాయకుడు కుడుముల శ్రీనివాస్, కోదాడ నుంచి అర్వపల్లి దర్గాకు పాదయాత్రగా బయలుదేరారు. ఆ పాదయాత్ర మునగాలకు చేరుకున్న సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో రషీద్, జాను, గట్టు వెంకన్న, రామకృష్ణ, మహేష్, జయరాజ్, రాజేంద్ర ప్రసాద్, నరేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారుజ

తుంగతుర్తి: కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దొనకొండ రమేష్ బెడ్ షీటను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిని మౌనిక, కొత్తగూడెం సర్పంచు విజయ్‌కుమార్, నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, కటకం వెంకటేశ్వర్లు, సీహెచ్ రాములు, జఠంగి మహేష్ పాల్గొన్నారు.

చిలుకూరు: మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం చేస్తున్న పోరాటం అంతిమ దశకు చేరుకుందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి తూరుగంటి అంజయ్య, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, జిల్లా నాయకులు రాము, సిద్దుల శ్రీను, మాతంగి రవి, ఎస్‌కె మౌలానా, మల్లెపంగు సూరి, మీసాల భరత్, రమేష్, రామారావు, సిద్దెల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

నాగారం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగే మండల సర్వసభ్య సమావేశానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు హజరుకానున్నట్లు ఎంపిడివో జి. శోభరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సకాలంలో సమావేశానికి హజరుకావాలని ఎంపిడివో కోరారు.

. **తిరుమలగిరి రూరల్:** టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చల్లగుండ సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా వీఎల్ఎన్ చార్యులు, కోశాధికారిగా వి.మహేష్, మహిళా ఉపాధ్యక్షులుగా వి.నాగమ్మ, జానయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్.సోమయ్య, యాదయ్య, పాల్గొన్నారు.

అర్వపల్లి,: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు దిర్శనం కృష్ణమూర్తి కోరారు. అర్వపల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో 22ఏళ్ల కష్టపడి ఎమ్మెల్యేగా గెలుపొందిన సామేల్‌కు ఎస్సీ కోటాలో మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.